క్లుప్తంగా

ముగిసిన అమ్మవార్ల పండగ



పూజలు అందుకున్న భూలోకమ్మ అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్డవాని పాలెం ప్రాంత ఆరాధ్య దేవతలు భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోలమాంబ అమ్మవార్ల పండగ బుధవారం అత్యంత వైభవంగా ముగిసింది. వేకువజాము నుంచి అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భూముల రీ సర్వే ప్రారంభం



పాడుగుపాలెంలో సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

ఆనందపురం : ఆనందపురం రెవెన్యూ గ్రామం పరిధిలోని పాడుగుపాలెంలో భూ రీసర్వే బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రైతుల వద్ద గల హక్కు పత్రాలు పరిశీలించారు. అనంతరం ఒక్కొక్క రైతుకు ముందుగానే భూ వివరాలతో రూపొందించిన పత్రాలు అందజేశారు. అనంతరం కమతాల వారీగా సర్వే చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, వీఆర్వో అప్పలరాజు, షిణగం చిన రామారావు, చందక అప్పలస్వామి పాల్గొన్నారు.

మత్స్యావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేసి ఈ అవతారం విశిష్టతను భక్తులకు వివరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక సబ్ స్టేషన్ ఏఈ సురేష్ కుమార్ తెలిపారు. వేములవలస, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, తర్లువాడ, గుడిలోవ, వెల్లంకి, పాలవలస, మెట్ట మీదపాలెం, ప్రకృతివానిపాలెం, సీతంపాలెం గ్రామాలకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని తెలిపారు.

శుక్రవారం పలు ప్రాంతాల్లో...

మధురవాడ: కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ మారికవలస ఇండస్ట్రియల్, జేకే లే అవుట్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్‌శాఖ ఏఈఈ సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, టయోటా షోరూం, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, ఆర్‌జీకే జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, జేకే లే అవుట్, కాపులుప్పాడ డంపిగ్‌యార్డు, డ్రైవర్స్ కాలనీలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులంతా గమనించి సహకరించాలని సురేష్‌కుమార్ కోరారు.

సమాజానికి సంజీవని యోగా



భీమిలి బీచ్‌లో యోగా చేస్తున్న అధికారులు



తాటితూరులో యోగా చేస్తున్న విద్యార్థులు



ఆసనాలు వేస్తున్న అవంతి ఇంజినీరింగ్ విద్యార్థులు

ఆనందపురం : యోగా సాధనతో మనసుకు, శరీరానికి స్వాంతన చేకూరుతుందని శొంఠ్యాం ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు బుద్దరాజు పద్మావతి అన్నారు. శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక కోణాలను యోగా సంయోగపరచి స్థిరమైన, ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులు వివిధ రకాల ఆసనాలు వేశారు. హెచ్‌ఎం జోగారావు, లెంక రాంబాబు, ఉమామహేశ్వరరావు పట్నాయిక్, రౌతు శ్రీను, బంగారాజు పాల్గొన్నారు.

- గుడిలోవ సరస్వతి విద్యా విహార ఆధ్వర్యంలో వేములవలస పూల మార్కెట్ వద్ద యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు ఆసనాలు వేసి ప్రజలను చైతన్య పరిచారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ తమ్మిన నరసింగరావు, గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దుక్క అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.
- గంభీరంలోని మైత్రేయి యోగా ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షకులు ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, జగదీశ్వరి, పీఏఎల్ లక్ష్మీనారాయణ, బొట్టా రామకృష్ణ పాల్గొన్నారు.
- శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో విద్యార్థులు సామూహిక యోగాసనాలు వేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లేశ్వరరావు యోగా ప్రాముఖ్యతను వివరించారు.
- ఎన్‌జీఆర్‌పురం వద్ద చెరువు పనికి వెళ్లిన ఉపాధి హామీ పథకం కూలీలు సుమారు 150 మంది చెరువు గట్టుపైనే యోగాలో భాగంగా ధ్యానం చేశారు.

కొమ్మాది: గీతం వర్సిటీలో గల కోడి రామమూర్తి ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవంలో వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, క్యాంపస్ లైఫ్ ప్రో వీసీ ప్రొఫెసర్ వై.గౌతమరావు తదితరులు యోగా, ధ్యాన ప్రక్రియను ప్రదర్శించారు. ఎండాడలోని అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.



యోగాసనాలు వేస్తున్న బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

యోగాకు పుట్టినిల్లు భారతదేశం

తగరపువలస: యోగాకు పుట్టినిల్లు భారతదేశం అని, నేడు ప్రపంచ దేశాలకు తన ప్రతిష్ఠను చాటుతోందని ప్రముఖ యోగా గురువు టీఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 400 మంది విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం కోసం యోగా అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ యోగా వేడుకలు జరుగుతున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు డొకర శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జమ్ము అప్పలనాయుడు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, తారకేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ప్రసాదరావు, ప్రభావతి, విజయకుమారి పాల్గొన్నారు.



శొంఠ్యాంలో యోగా చేస్తున్న విద్యార్థులు

- భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు, ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం

తగరపువలస: యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యపడుతుందని ఆనందాశ్రమం యోగా గురువు విజయనందాజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చెరకుపల్లి అవంతి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.అర్జునరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షరీఫ్ పాల్గొన్నారు.

మధురవాడ: ప్రపంచ యోగా దినోత్సవాన్ని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన యోగాసనాలు, సూర్య నమస్కారాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అందరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. పీడీ పెంటకోట రాము, పీఈటీలు ఎండీ పాషా, ఎ.నాగమణి, ఎన్‌సీసీ గైడ్ తులసి, మురళి పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ లైట్ హౌస్ అండ్ లైట్‌షిప్స్ శాఖ ఆధ్వర్యంలో రీజినల్ డైరెక్టర్ ముఖేష్‌వర్మార్ పర్యవేక్షణలో సిబ్బంది యోగాసనాలు వేశారు. డిప్యూటీ డైరెక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

- స్థానిక అంతర్జాతీయ యోగా కేంద్రంలో వెంకటరమణ ఆధ్వర్యంలో సభ్యులు యోగాసనాలు వేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా విద్య శిక్షణ సంస్థ, ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు.

పీఎం పాలెం: జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిల్పారామం జాతరలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.వాకర్స్ అందరూ యోగాసనాలు వేశారు.

పద్మనాభం: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శివరాణి పాల్గొన్నారు.



చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పద్మనాభంలో యోగాసనాలు వేస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్, ఉద్యోగులు

జలజీవన్ మిషన్‌తో సురక్షిత నీరు

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ సురక్షిత మంచినీటిని అందించడానికి చర్యలు చేపడుతున్నట్టు జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య తెలిపారు. మండలంలోని తర్లువాడలో బుధవారం గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ పారిశుధ్య కమిటీలు గ్రామంలో నీటి అవసరాలను గుర్తించాలన్నారు. మంచినీటిని పరిశీలించడానికి సచివాలయాలకు పరీక్ష యంత్రాలు అందించామని, వాటితో కమిటీలు ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాలన్నారు. తాగునీటిని వృథా చేయరాదన్నారు. మురుగు కాలువల్లో కుళాయి పైపులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, కార్యదర్శి కరుణాకర్‌రావు, జలజీవన్ మిషన్, మండల కో – ఆర్డినేటర్ జగదీశ్వరి, ఎంఐసీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనిట్స్‌లో ముగిసిన వర్క్‌షాప్

తగరపువలస: సంగివలస అనిట్స్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెండు రోజులుగా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, అనిట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూక్లియర్ పవర్ జనరేషన్ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ఈ వర్క్‌షాపు ముగింపు కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అదనపు చీఫ్ ఇంజినీర్లు పి.బంగారయ్యశెట్టి, బల్లా రవికుమార్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ పీఆర్ దేవన్ పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి బి.నాగరాజు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమికి సంపూర్ణ పోషకాలు



రైతులకు నవ ధాన్యాలు కిట్లు పంపిణీ చేస్తున్న డీపీఎం మోహన్‌రావు

పద్మనాభం: నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూమికి సంపూర్ణ పోషకాలు లభిస్తాయని సేంద్రియ వ్యవసాయం జిల్లా డీపీఎం మోహన్‌రావు సూచించారు. మండలంలోని కోరాడలో రైతులకు నవధాన్యాల కిట్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు.

తుది దశకు చేరుకున్న మెట్ల నిర్మాణం



శ్రీవారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మెట్లు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నడుస్తూ చేరుకునేందుకు మెట్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. మెట్ల నిర్మాణం పూర్తికాగా వాటి చుట్టూ గోడ, పైన శ్లాబ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి చేరుకునేందుకు ఇప్పటికే సుందరమైన ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. కొండ దిగువ భాగం నుంచి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వరకు ఉన్న శ్రీవారి శంఖు, నామ, చక్రాల వరకు ఈ మెట్లు ఉంటాయి. అక్కడ నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో ఆలయం ఉండటంతో భక్తులు సులభంగానే చేరుకోవచ్చు. మెత్తం 240 మెట్లు, మధ్యమధ్యలో ఫ్లాట్ ఫారం నిర్మిస్తున్నారు. తిరుపతి తరహాలో భక్తులకు ఎండతోగానీ, వర్షంతోగానీ ఇబ్బంది లేకుండా ఉండేదుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు క్షేమంగా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోవచ్చు. మెట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, శ్రావణ మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. భక్తులు సులువుగా మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

పీఎం పాలెం: రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా నిఘా కొనసాగుతోందని, పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ శివరామరెడ్డి హెచ్చరించారు. పీఎం పాలెం, భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లకు మంగళవారం రాత్రి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిఘా నిరంతరం ఉంటుందని, చట్ట వ్యతిరేక పనులు చేసే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కూడా వెనకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వై.రామకృష్ణ, రామ చంద్రరావు, లక్ష్మణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా విద్యుత్ శాఖ నిర్వహణ పనులు

మధురవాడ: వర్షాకాలం సమీపిస్తుండడంతో విద్యుత్ శాఖ ముందస్తుగానే సరఫరాలో అంతరాయాలు తొలగించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టారు. మధురవాడ హైవేని ఆనుకుని ఉన్న కొమ్మాది జంక్షన్, జీవీఎంసీ జోనల్ ఆఫీసు, భాస్కరనగర్, సంపత్ నగర్, జాతర చుట్టుపక్కల ప్రాంతాల్లో లూజ్ కండక్టర్‌లు మార్పు చేశారు. తుప్పు పట్టిన జంపర్‌లు, వైర్లు, క్రాసారాలు మార్పు చేశారు. పనులను మధురవాడ సబ్ స్టేషన్ ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి పరిశీలించారు.

విద్యార్థులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన చిట్టివలస హైస్కూల్ విద్యార్థులు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 28న నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఫైనాన్సియల్ లిటరసీ కౌన్సిలర్ మధు చెప్పారు. విశాఖ రూరల్ మండలంలోని మధురవాడ, ఆరిలోవ, గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరుకాగా గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకి చెందిన కీర్తి మేఘన, సంతోషి లక్ష్మి విజేతలుగా, గోపాలపట్నం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవర్ధన్, సత్యప్రహర్ష రన్నర్స్‌గా నిలిచారు. మేఘాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు గౌతమి, గంగ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు.

చిట్టివలస హైస్కూల్ విద్యార్థులకు ఫస్ట్

తగరపువలస: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫైనాన్సియల్ లిటరసీపై అవగాహన నిమిత్తం భీమిలిలో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 28న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

దిశ పోలీసుల విచారణ

గోపాలపట్నం: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన హెచ్‌ఎం రామిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన హెచ్‌ఎం ఐ.వి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.వి.టి.కె.నాగేశ్వరరావు, కె.మాధురిలను పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన రమణ, మరగడ అప్పారావు, మజ్జి శంకర్, మల్లపురెడ్డి సత్యనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ రామస్వామి, హెచ్‌ఎం వి.శంకరరావు, రిటైర్డు ఎంపీడీవో బాపిరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

భీమునిపట్నం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫోరం చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరికైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. చాలా మందికి ఫిర్యాదు చేసే పద్ధతి తెలియకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వినియోగదారులు కొన్ని సమస్యలు ప్రస్తావించగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు సకరయ్య, రవి, రాము పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి సాయం



స్నేహితుని కుటుంబ సభ్యులకు రూ.40 వేలు అందిస్తున్న చిట్టివలస పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1984 – 85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడు అల్లు రాజేష్ కుమార్తె వివాహ కానుకగా బుధవారం రూ.40 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్థిక సాయం చేశామన్నారు. కార్యక్రమంలో అక్కరమాని మంగరాజు, తిప్పాన శ్రీనివాసరావు, మామిడి భాస్కరరావు, ఎ.శ్రీనివాసరావు, ఇ.రవి, టి.ఎస్.ఆర్, బి.ఈశ్వర్, టి.గోపాల్, వి.కిషోర్, ఎ.కొండబాబు, కె.సాయిబాబా, కె.ఎస్.మురళి, వి.దేవానంద్, జి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి ఇరుక్కుపోయింది..



డ్రమ్‌లో ఇరుక్కుపోయిన గేదె తల భాగం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు సోమన్నపాలెం కంచికామాక్షి ఆలయం వద్ద ఓ గేదె ప్లాస్టిక్ డ్రమ్‌లో ఆహారాన్ని తినేందుకు వచ్చింది. దానిలో నోరు పెట్టి ఆహారం తినే క్రమంలో మెడ భాగం ఆ డ్రమ్‌లో ఇరుక్కుపోయింది. ఇబ్బంది పడుతున్న గేదెను చూసి స్థానిక యువకులు డ్రమ్ తొలగించారు. బతుకు జీవుడా అంటూ ఆ గేదె అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం



త్రోబాల్ పోటీల్లో 2కే 20 జట్టు తరపున చేసిన సర్వ్‌ను ఎదుర్కొంటున్న 2కే 22జట్టు

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, పుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివ సత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కే20 బ్యాచ్ జట్టుతో 2కే22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్స్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

గోమాత మూగరోదన

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నగరపాలెం జంక్షన్ నుంచి ఉప్పాడ వెళ్లే మార్గ మధ్యలో వైజాగ్ నుంచి అతి వేగంగా వస్తున్న కారు ఆవును బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆవు అవతలివైపు రోడ్డుపై పడిపోయింది. అయితే ఆ కారు ఆపకుండానే వెళ్లిపోయింది. అదే సమయంలో భీమిలి నుంచి కారులో వస్తున్న గీత అనే యువతి దీనావస్థలో ఉన్న ఆవును చూసి వెంటనే డాక్టర్లకు సమాచారం అందించారు. ఢీకొట్టిన కారు నంబరు నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.